సాక్షి తిరుపతి

సోమవారం । 3 । జూన్ । 2024



పవిత్రం.. హనుమ జన్మస్థలం

తిరుమలలోని ఆకాశగంగ, జాపాలి తీర్థాల్లో ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. - 8లో



ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

తిరుపతిలోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పెషల్ క్యాంపు ఆదివారం తో ముగిసింది. - 8లో



కండలేరు జలాశయం గేట్ల పరిశీలన

కండలేరు జలాయశం గేట్లను తెలుగు గంగ సీఈ రమణ, ఎస్ఈ రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 78,686 మంది స్వామివారిని దర్శించుకోగా 37,888 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.54 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

12 వరకు ఎస్వీ సంగీత కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర డోలు పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను పలు రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ, మృదంగం, డోలు, ఘటం వంటి విభాగాలలో కోర్సులు ఉన్నాయి. ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్ , డిప్లొమా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల వారు కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. ఇతర వివరాలకు 0877–2264597, 7330811173, 9440793205 నంబర్లలో సంప్రదించవచ్చు.

స్పెషల్ పోలీస్ అబ్జర్వర్‌కు సాదర స్వాగతం



దీపక్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రేణిగుంట: స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్పీ కులశేఖర్ తదితరులు ఉన్నారు. అనంతరం దీపక్‌మిశ్రా రోడ్డు మార్గాన తిరుపతికి బయల్దేరి వెళ్లారు.

మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 7వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఉచితంగా మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతని వెల్లడించారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణపత్రాలు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి. 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



ప్లాన్-1

- కౌంటింగ్ కేంద్రంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లను రెచ్చగొట్టే విధంగా కొందరు పోలీసులు వ్యవహరించేవిధంగా ప్రణాళిక రచించినట్టు సమాచారం.
- ఓట్ల లెక్కింపులో కావాలనే కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని కౌంట్‌లోకి వేసే ప్రయత్నం చేయనున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.
- ఆ విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు గ్రహించి అభ్యంతరం వ్యక్తం చేసేలోపే అందుకోసమే అక్కడ ఎదురు చూస్తున్న పోలీసులు, కౌంటింగ్ అధికారులు కొందరు సంబంధిత ఏజెంట్లను, స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లను వెలుపలకు పంపేందుకు కుట్రపన్నుతున్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

ప్లాన్-2

- ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపేందుకు వీలుకాని పక్షంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూటమి అభ్యర్థులకు అనుకూలంగా వేసేందుకు కొందరు పోలీసులు, అధికారులు ప్రయత్నాలు ప్రారంభించనున్నట్టు సమాచారం.
- ఎన్నికల కమిషన్ నిబంధనలు, వాస్తవ నిబంధనలను భేరీజు వేసుకుని ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేయనున్న నేపథ్యంలో కౌంటింగ్ చివరి నిమిషంలో కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన ఓట్లను వారి ఖాతాల్లో వేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.
- అధికారులు కొందరు కూటమి అభ్యర్థుల ఆమ్యామ్యాలకు లొంగి వారికి అనుకూలంగా మెజారిటీకి అవసరమైన కొన్ని ఓట్లను వారికి కలిపేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం.



కన్నింగ్ ఖాకీలు

- పోలింగ్ రోజునే టీడీపీ నేతలకు మద్దతుగా విధులు
- నిత్యం కూటమి అభ్యర్థులతో టచ్‌లో ఉన్న కొందరు 'పచ్చ' పోలీసులు
- ఓట్ల లెక్కింపు కేంద్రంలో వీరి వల్లే గొడవలకు ఆస్కారం?
- ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకే కౌంటింగ్ డ్యూటీ?

ఓట్ల లెక్కింపు రోజున అల్లర్లకు టీడీపీ నేతలు పన్నాగాలు పన్నుతున్నారా..? అనుకూల ఫలితాలు రాకుంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని కుట్ర చేస్తున్నారా..? అందులో భాగంగానే తమకు చెంచాగిరీ చేసే ఖాకీలకు బందోబస్తు విధులు కేటాయించేలా పథకం రచించారా..? కౌంటింగ్ కేంద్రంలో ఏం జరుగుతోందో క్షణ క్షణం తమకు సమాచారం అందించేలా ప్రణాళిక రూపొందించారా..? పచ్చముూకను పురిగొల్పేందుకు కన్నింగ్ ఖాకీల సహకారం తీసుకోనున్నారా..? ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తోంది. కౌంటింగ్ నాడు గొడవలు చేసేందుకు టీడీపీ నాయకులు ఏకంగా కొందరు వివాదాస్పద పోలీసులను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది.

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : మరో 24 గంటల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభంకానుంది. జిల్లా యంత్రాంగం ఇందు కోసం పక్కాగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. అయితే ఈనెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజున ఖాకీ దుస్తులు వేసుకున్న కొందరు అధికారులు కూటమి అభ్యర్థులకు మద్దతుగా అరాచకం సృష్టించేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. అనుకున్న ఫలితాలు రాకుంటే ఓట్ల లెక్కింపు కేంద్రంలో గలాటాలు చేయడానికి సహకరించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎప్పటికప్పుడు కౌంటింగ్ సెంటర్‌లో జరిగే పరిణామాలను పచ్చ పార్టీ నేతలకు చేరవేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఓట్ల లెక్కింపు కేంద్ర వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికే పచ్చ పార్టీ నాయకులు ఏకంగా కొందరు ఖాకీలను ఎంపిక చేసుకున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించకుంటే తీవ్ర పరిణామాలకు కొందరు ఖాకీలే మూలకేంద్రంగా మారనున్నారనే భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఆ గొడవల్లో ప్రమేయం

పోలింగ్ రోజు, తదనంతరం జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న ఘర్షణలు, పరిణామాలు తెలియనివి కావు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులే లక్ష్యంగా టీడీపీ నేతలు దాడులు చేసి, కొందరిని మట్టుబెట్టాలని భారీ ప్రణాళికలు వేశారు. నడిరోడ్డుపైనే రౌడీయిజం చెలాయించి తిరుపతి వాసులను భయభ్రాంతులకు గురిచేశారు. తీరా ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించడంతో భయపడిన పచ్చ పార్టీ నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ మొత్తం వివాదంలో కొందరు పోలీసు అధికారుల ప్రత్యక్ష ప్రమేయం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నా ఇప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ నాయకులపైకి ఉసిగొలిపి దాడులు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది కొందరు పోలీసు అధికారులేనని బలంగా వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలను రెచ్చగొట్టి, కవ్వింపు చర్యలకు పాల్పడి.. ఆపై దాడులు చేసేలా పథకం వేసినట్లు సమాచారం . వైఎస్సార్‌సీపీ నేతల స్వీయ రక్షణలో జరిగిన చిన్నపాటి గొడవను భూతద్దంలో చూపించి, ప్రజలను భయకంపితులు చేయాలని కొందరు పోలీసులే పక్కా ప్లాన్ వేసినట్లు తెలిసింది. ఈ కుట్రలో పలువురు సీఐలు, ఎస్ఐల నుంచి కింది స్థాయి కానిస్టేబుళ్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పక్కాగా స్కెచ్!

ఎన్నికల వేళ గొడవలు చేసేందుకు తిరుపతి నగరానికి చెందిన ఓ మొబైల్ దుకాణం యజమాని.. కొందరు పోలీసు అధికారులు కలిసి జట్టుగా ప్రణాళిక రూపొందించినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ నేతలను రెచ్చగొట్టి, ఎవరూ చూడకుండా దాడులు చేయాలని ఆ మొబైల్ దుకాణంలో స్కెచ్ వేసినట్లు వెల్లడిస్తున్నారు.. ఇందు కోసం పలువురు సీఐలు, ఎస్‌లకు వాట్సాప్ కాల్స్ చేసి వాళ్ల సహాయం కూడా తీసుకున్నారని చెబుతున్నారు. పోలింగ్ జరిగిన రోజున, తర్వాత ఈ కుట్రలో భాగస్వాములైన పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మొబైల్ దుకాణం యజమానితో టచ్‌లో ఉన్నట్లు బలంగా వినిపిస్తోంది. వీళ్ల సూచనలతోనే కేవలం టీడీపీ నాయకులపై జరిగిన దాడులను ఎలక్ట్రానిక్ పరికరాలతో రికార్డు చేసేలా ఓ పన్నాగం పన్నినట్లు తెలిసింది. పైగా వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద అంగరక్షకులుగా ఎవరెవరు ఉన్నారు..? షిఫ్టులో ఎవరు మారుతున్నారు..? లాంటి వివరాలు సేకరించి కూటమి నేతలకు ఉప్పందించినట్లు సమాచారం. కచ్చితంగా అధికారంలోకి వస్తామని, వచ్చిన వెంటనే తమకు అండగా నిలిచిన అధికారులను అందలం ఎక్కిస్తామని కూటమి నేతలు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

పొంచి ఉన్న ముప్పు!

ఈ మొత్తం గొడవల్లో ప్రధానంగా కొందరు పోలీసు అధికారుల పేర్లు వినిపిస్తోంది. తిరుపతి క్రైమ్‌లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు, స్పెషల్ బ్రాంచ్ వెస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారి, స్పెషల్ బ్రాంచ్ అలిపిరి పరిధిలో పనిచేస్తున్న ఓ ఉన్నతోద్యోగి, తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కీలక అధికారి, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోని చిన్నస్థాయి సిబ్బంది. వెస్ట్ స్టేషన్ ఉన్నతాధికారి, అలిపిరి స్టేషన్‌లో పనిచేసి సస్పెండ్ అయిన ఓ ఉన్నతోద్యోగి. ఈస్ట్ పోలీస్ స్టేషన్ చిరుద్యోగి, తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్ కెళ్లిన ఓ ఉన్నతాధికారికి కూటమి అభ్యర్థులతో ప్రత్యక్ష సంబంధాలున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు సాక్ష్యాలను సైతం సేకరించారు. వీరికి కౌంటింగ్ కేంద్రంలో విధులు వేస్తే.. ఎంతకైనా తెగిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ముందస్తుగా పొంచి ఉన్న ముప్పును పసిగట్టాలని అభ్యర్థిస్తున్నారు. కన్నింగ్ ఖాకీలకు కౌంటింగ్ విధులు కేటాయించొద్దంటూ ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

కట్టుదిట్టంగా కౌంటింగ్

- రేపే ఓట్ల లెక్కింపు
- పకడ్బందీగా ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కి కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కౌంటింగ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా గొడవలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్ , ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపునకుశిక్షణ, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించడం, ఎన్కోర్ లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటీ సిస్టమ్ ఏర్పాటు, ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎంలను సీల్ చేసే విధానంపై అవగాహన, నివేదికలు పంపించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు, ఈ నెల 8వ తేదీ లోపు నివేదించాల్సిన ఇండెక్స్ కార్డు రూపొందించే విధానం తదితర అంశాలను వివరించారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.4వ తేదీ సాయంత్రం 4.10 గంటల్లోపు కౌంటింగ్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు 3వ తేదీన అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ జరుగుతుందని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత కల్పించినట్లు తెలిపారు. 144 సెక్షన్‌ను కొనసాగిస్తున్నటు వెల్లడించారు. డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఈటీబీపీ నోడల్ అధికారి సృజన పాల్గొన్నారు.

నిబంధనలు కఠినతరం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4వ తేది ఉదయం 8 గంటలకు ప్రారంభించి సాయంత్రానికి పూర్తి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ క్రమంలో కౌంటింగ్ నిబంధనలను కఠినతరం చేశారు. అందులో భాగంగా కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఈసీ అనుమతి ఉన్న వ్యక్తులు, పరిశీలకులు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. అభ్యర్థులైతేనే కౌంటింగ్ హాలులోకి ప్రవేశం ఉంటుంది. ఓట్ల లెక్కింపు సమయంలో ఎవరైనా ఏజెంట్ అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలు పాటించకపోయినా బయటకు పంపించే అధికారం రిటర్నింగ్ అధికారికి ఉంటుంది. కౌంటింగ్ హాలుకు వందమీటర్ల పరిధిలో మార్కింగ్ చేస్తారు. దీని చుట్టూ బారి కేడ్లు నిర్మిస్తారు. ఒక ప్రవేశ ద్వారం ఉంటుంది. ఇక్కడ స్థానిక పోలీసులను నియమిస్తారు. కౌంటింగ్ హాలుకు వంద మీటర్ల అవతలే వాహనాలను నిలిపివేస్తారు.స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాలు దూరంగా ఉన్నప్పుడు ఈవీఎంలు తీసుకుని వెళ్లడానికి అసౌకర్యంగా ఉంటుంది. అందువల్ల స్ట్రాంగ్ రూమ్ డోర్ వద్ద నుంచి కౌంటింగ్ హాలు వరకూ ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తారు.ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్ భవనాల ప్రవేశద్వారం నుంచి కౌంటింగ్ హాళ్ల వరకూ ఉన్న ప్రదేశాన్ని రెండో అంచెగా పరిగణిస్తారు. ఇక్కడ తగినంత మంది రాష్ట్ర సాయుధ పోలీసులు ఉంటారు.ఆడియో, వీడియో రికార్డు చేయగల మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోనికి అనుమతించరు. అలాగే అగ్గిపెట్టె, ఇంకు పెన్నులు, బ్లేడ్లు, చాకులు, పిన్నులు, ఆయుధాలను కూడా అనుమతించరు. పెన్సిల్, తెల్లకాగితాలు తీసుకుని వెళ్లవచ్చు. రెండో అంచెలో రాష్ట్ర పోలీసులు మాత్రమే తనిఖీలు చేస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది లోపలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రవేశ ద్వారం ఏర్పాటు చేస్తారు. కౌంటింగ్ హాలు బయట నిలబడి ఎవరూ ఫోన్లలో మాట్లాడకూడదు. మీడియా లేదా పబ్లిక్ కమ్యూనికేషన్ రూములో మాత్రమే ఫోన్లు మాట్లాడుకోవచ్చు. ఫోన్లు డిపాజిట్ చేసే సౌకర్యం కల్పించారు. కౌంటింగ్ కేంద్రం ద్వారం వద్ద మూడు అంచెల భద్రత ఉంటుంది.ఇక్కడ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉంటారు. రిటర్నింగ్ అధికారి పిలిస్తే తప్ప వీరు కౌంటింగ్ హాల్‌లోకి వెళ్లరు. మరోవైపు ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలి. కౌంటింగ్ హాల్ అంతా తిరిగేందుకు వారికి అనుమతి లేదు. మరోవైపు 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

సిద్ధంగా లెక్కింపు కేంద్రాలు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల భవనంలో చేపట్టనున్నారు. ఈ క్రమంలో 1,100 మంది ఉద్యోగులకు విధులు కేటాయించారు. అయితే ఆయా అధికారులు డ్యూటీ వివరాలను గోప్యంగా ఉంచారు. కౌంటింగ్‌కు గంట సమయం ముందుగా ఏ అధికారి ఏ బ్లాక్‌కు ఇన్‌చార్జిగా నియమించారనే వివరాలు వెల్లడించనున్నారు.

అసెంబ్లీల సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలు ఇవీ..

గూడూరు

అసెంబ్లీ– పార్లమెంట్ : విశ్వేశ్వరయ్య బ్లాక్,3 ఫ్లోర్, రూమ్ నంబర్ 407

సూళ్లూరుపేట

అసెంబ్లీ : విశ్వేశ్వరయ్య బ్లాక్,3 ఫ్లోర్, రూమ్ నంబర్ 306

పార్లమెంట్ : విశ్వేశ్వరయ్య బ్లాక్,3 ఫ్లోర్, రూమ్ నంబర్ 307

వెంకటగిరి

అసెంబ్లీ : సీవీ రమణ బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్, రూమ్ నంబర్ 101

పార్లమెంట్ : విశ్వేశ్వరయ్య బ్లాక్,గ్రౌండ్ ఫ్లోర్, రూమ్ 105

చంద్రగిరి

అసెంబ్లీ : లైబ్రరీ హాల్, కేఎల్‌రావ్ బ్లాక్, ఫస్ట్ ఫ్లోర్

పార్లమెంట్ : ధ్రుతీ మల్టీపర్పస్ హాల్, కేఎల్‌రావ్ బ్లాక్,గ్రౌండ్ ఫ్లోర్

తిరుపతి

అసెంబ్లీ: సీవీ రమణ బ్లాక్, 2 ఫ్లోర్, రూమ్ నంబర్ 312

పార్లమెంట్ : సీవీ రమణ బ్లాక్, 2 ఫ్లోర్, రూమ్ నంబర్ 301

శ్రీకాళహస్తి

అసెంబ్లీ : విశ్వేశ్వరయ్య బ్లాక్, ఫస్ట్ ఫ్లోర్, రూమ్ నంబర్ 206

పార్లమెంట్ : విశ్వేశ్వరయ్య బ్లాక్, ఫస్ట్ ఫ్లోర్, రూమ్ నంబర్ 207

సత్యవేడు

అసెంబ్లీ: సీవీ రమణ బ్లాక్, 3 ఫ్లోర్, రూమ్ నంబర్ 403

పార్లమెంట్ : సీవీ రమణ బ్లాక్, 3 ఫ్లోర్, రూమ్ నంబర్ 410



సూచనలిస్తున్న పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

అప్రమత్తత అవసరం

తిరుపతి సిటీ/తిరుపతి క్రైమ్: కౌంటింగ్ ఏర్పాట్లలో అప్రమత్తంగా అవసరమని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. ఆదివారం రాత్రి పద్మావతి వర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఈసీఐ ప్రతినిధి, రాష్ట్ర ప్రత్యేక పోలీస్ అధికారి దీపక్ మిశ్రాతో కలసి పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, జనరేటర్ ఏర్పాటు, శానిటేషన్, తాగునీరు, పార్కింగ్, హెల్ప్‌డెస్క్‌లు, మీడియా పాయింట్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, హెల్త్, మొబైల్ టాయిలెట్స్ తదితర ఏర్పాట్లు పక్కా ఉండాలని ఆదేశించారు. అనంతరం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.

పకడ్బందీగా బందోబస్తు విధులు

- ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత
- అమలులో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



సమావేశానికి హాజరైన పోలీస్ సిబ్బంది

తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో బందోబస్తు విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. ఆదివారం శ్రీపద్మావతి వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో పోలీసుల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సుమారు 15 రోజుల నుంచి శాంతి భద్రతల పరిరక్షణ పోలీసులు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎవరికి కేటాయించిన విధులను వారు చిత్తశుద్ధితో పూర్తి చేయాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కట్ ఆఫ్ పాయింట్ల వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు తమ వాహనాలను పంగలూరు సీతమ్మ రోడ్‌లో పార్కింగ్ చేసుకోవాలని, గేట్ నంబర్ ఒకటి నుంచి వారిని లోపలికి పంపించాలని చెప్పారు. ఆర్‌ఓ జారీ చేసిన ధ్రువీకరణ పత్రంతో పాటు ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును పరిశీలించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలను యూనివర్సిటీ ప్రాంగణంలోకి తీసుకురానివ్వకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అబ్జర్వర్లు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఈటీపీబీ ఆపరేటర్ మాత్రమే మొబైల్ ఫోన్లు తీసుకెళ్లవచ్చని వెల్లడించారు. వీరిని గేట్ నంబర్ రెండు ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం వారు జారీ చేసిన గుర్తింపు కార్డు ఉన్న మీడియా ప్రతినిధులకు మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇన్నర్ కార్డెన్ ఔటర్ కార్డెన్‌లో ఉన్న క్లియరింగ్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎవరూ ఉండకుండా చూసుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో అంబులెన్స్, ఫైర్ ఇంజన్లకు మార్గం క్లియర్ గా ఉంచుకోవాలన్నారు. తిరుపతి నగరంతో పాటు ఔటర్ కార్డెన్, ఇన్నర్ కార్డులో ఎక్కడ కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ తమ పాయింట్ వద్ద సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, క్రమ పద్ధతిలో వాహనాలను పార్కింగ్ చేయించాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్ వెనకవైపు, తుమ్మలగుంట రోడ్డు వైపు ఉన్న పార్టీలు మరింత క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. కఠినంగా పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఎవరైనా మాట వినకపోతే బల ప్రయోగమైన చేసి అదుపు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ ఎస్పీ సరిత, ఏఎస్పీ వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'హంస' తిరుపతి శాఖ ఎన్నిక



నూతన కమిటీ

తిరుపతి తుడా: ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్) తిరుపతి శాఖ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. తిరుపతి అధ్యక్షుడిగా సి.రాజేష్, సెక్రటరీ గా నరేంద్ర, ట్రెజరర్‌గా శాంతకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా స్వర్ణలత, ఆర్గనైజింగ్ సెక్ర టరీగా నరేష్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా ఈశ్వరయ్య, మహిళా వింగ్ సెక్రటరీగా అరుణమ్మ, వైస్ ప్రెసిడెంట్‌గా గంగమ్మ, పద్మజ, కాంచన జయలక్ష్మి, సునీల్ కుమార్ ఎన్నికైనట్లు వివరించారు.

క్లుప్తంగా

11నుంచి పీజీ కళాశాలల పునఃప్రారంభం

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలలు ఈ నెల 11వ తేదీ నుంచి పునఃప్రారంభమవుతాయని రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈనెల 10వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. వేసవి సెలవులు పూర్తయిన నేపథ్యంలో విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని సూచించారు.

గంధమనేని శివయ్య సతీమణి కన్నుమూత


పారిజాతమ్మ (ఫైల్)

పుత్తూరు: కమ్యూనిస్టు నేత, పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ (84) ఆదివారం పరమపదించారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య 1967లో సీపీఐ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. భర్త శివయ్య మరణానంతరం ప్రతినెలా ప్రభుత్వం నుంచి తీసుకున్న పింఛను నగదును పారిజాతమ్మ గత నెల వరకు కూడా సీపీఐ పార్టీకి విరాళంగా అందించడం విశేషం. చెన్నైలోని కోడంబాక్కం ఎన్‌టీఆర్ స్ట్రీట్‌లోని స్వగృహం నుంచి పారిజాతమ్మ అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని ఆమె కుమారుడు గౌతమ్ తెలిపారు.

ఎడెక్స్ అడ్మిషన్లలో ఎస్వీయూ టాప్

- 80 కోర్సుల్లో 16,561 మంది విద్యార్థులు
- ఇప్పటికే 5,858 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

తిరుపతి సిటీ : పేద విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే సంపన్నవర్గాలకు మాత్రమే పరిమితమైన విదేశీ విద్యను పేద పిల్లలకు సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆక్స్‌ఫోర్డ్, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ, సింగపూర్ యూనివర్సిటీ, ఎంఐటీ, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, జర్మన్ దేశాలలోని టాప్ 10 వర్సిటీల్లో పేద విద్యార్థులు చదువుకునే వెసులుబాటు కల్పించారు. అందులో భాగంగా ఆన్‌లైన్ విద్యలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఎడెక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వివిధ విభాగాలలో సుమారు 80 రకాల కోర్సులను పేద విద్యార్థులు అభ్యసించే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ఎస్వీయూ పరిధిలో..

ఎస్వీయూ పరిధిలో డిగ్రీ, పీజీలో టెక్నికల్, నాన్-టెక్నికల్ కోర్సులలో విద్యనభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులు సుమారు 16,561మంది విదేశీ విద్యను అభ్యసిస్తున్నారు. అత్యధిక సంఖ్యలో ఎడెక్స్ విద్య కోసం అడ్మిషన్లు పొందిన విద్యాసంస్థల్లో ఎస్వీయూ టాప్‌లో నిలిచింది. ప్రపంచంలోని టాప్ 10 యూనివర్సిటీల్లో ఎస్వీయూ విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇప్పటికే సుమారు 5,858మంది పలు కోర్సులను పూర్తి చేసి విదేశీ వర్సిటీల నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారు. ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న దాదాపు అందరు విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు ఎడెక్స్ ఆన్‌లైన్ విద్యను అభ్యసిస్తున్నారు.


ఎస్వీయూ పరిపాలనా భవనం

ఇదో విప్లవమే..



విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించి, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతో టాప్ 10 వర్సిటీలలో పలు విదేశీ డిప్లొమా కోర్సులను అందిస్తున్నాం .ఎస్వీయూ పరిధిలోని విద్యార్థులు ప్రస్తుతం తాము అభ్యసిస్తున్న విద్యకు అనుబంధంగా ఉన్న డిప్లొమా కోర్సులను ఎంచుకుని అడ్మిషన్లు పొందారు. ఆన్‌లైన్ ద్వారా చదువుకుంటున్నారు. విద్యారంగంలో ఇదో విప్లవమే.

\- దివాకర్‌రెడ్డి, ఎడెక్స్ కోర్స్ కో-ఆర్డినేటర్, ఎస్వీయూ, తిరుపతి

కండలేరు జలాశయం గేట్ల పరిశీలన


గేట్లు పరిశీలిస్తున్న సీఈ రమణ, ఎస్ఈ వెంకటరమణారెడ్డి

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయాన్ని ఆదివారం తెలుగుగంగ సీఈ రమణ, ఎస్ఈ రమణారెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ కండలేరు జలాశయం హెడ్ రెగ్యులేటర్ గేట్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని రిపేరు చేసే నిమిత్తం పరిశీలించినట్లు వెల్లడించారు. హెడ్ రెగ్యులేటర్ గేట్లు రిపేరుకు సుమారు కోటి రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అలాగే జలాశయంలోపల ఉన్న రివిట్‌మెంట్ దెబ్బతిందని, ఈ రివిట్‌మెంట్ 7వ కిలోమీటర్ నుంచి 9.5 కిలోమీటర్ వరకు అలల తాకిడికి రాళ్లు లేచిపోయాయని చెప్పారు. విటి మరమ్మతులకు సుమారు రూ.13 కోట్లు అవసరమని తెలిపారు. త్వరలో ఈ రెండు పనులకు టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. వర్షాలొచ్చే నాటికి పనులు పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే పికప్ ఏరు కాలువ గేట్లను పరిశీలించి.. సంబంధిత అధికారలతో సమీక్షించారు. ప్రస్తుతం జలాశయంలో 6.621 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వారి వెంట జలాశయం ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


చిన్నారుల నృత్య ప్రదర్శన

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన ప్రత్యేక సమ్మర్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. సుమారు 70 మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో నృత్యం, కుండల తయారీ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ పొందారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. టర్రెకోట, డ్రాయింగ్, నృత్యాలపై చిన్నారులు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచినట్లు శిల్పారామం ఏఓ ఖాదర్‌వల్లీ తెలిపారు.

క్షేత్ర స్థాయిలో జూడో క్రీడలు


క్రీడాకారులతో జూడో చైర్మన్ నాగూరయ్య


క్రీడాకారుల ప్రదర్శనలు

నాయుడుపేట టౌన్: క్షేత్ర స్థాయిలో ప్రతిభావంతులను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా రాష్ట్రంలో మూడు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర జూడో అసోసియేషన్ చైర్మన్ నాగూరయ్య వెల్లడించారు. ఆదివారం కేఎంఆర్ కన్వర్షన్ సెంటర్‌లో జరిగిన ఫెలిసిటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జపాన్ దేశంలో పుట్టిన జూడో క్రీడ తూర్పు ఆగ్నేయాసియా దేశాల్లో మాత్రమే మంచి గుర్తింపులో ఉందన్నారు. జూడో క్రీడకు ఒలింపిక్స్‌లో 58 బంగారు పతకాలకు అవకాశం ఉందన్నారు. అయితే ఈ క్రీడలో మనం చాలా వెనుకబడి ఉన్నామని చెప్పారు.
విజయవా డ, వైజాగ్, తిరుపతి పట్టణాల్లో ఉచిత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రూ 200 కోట్లతో ఓజిలి మండలం పెద్దపరియ వద్ద క్రీడా కళాశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆస్పత్రి నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నిర్వహించిన డెమో కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. కా ర్యక్రమంలో జూడో అసోసియేషన్ సభ్యులు రాయ పు రమేష్‌నాయుడు, సీఈఓ నామిశెట్టి వెంకట్, డాక్టర్ అనుదీప్, బట్టా సుబ్రమణ్యం, బాలు, డాక్టర్ సందీప్, ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ భాస్కర్‌నాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

నిఘా నీడలో కౌంటింగ్


కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

- సార్వత్రిక ఓట్ల లెక్కింపు రేపే
- సాయంత్రం 4గంటలకు కౌంటింగ్ పూర్తి
- శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- 144 సెక్షన్ కొనసాగింపు...
- 6 వరకు ఎన్నికల కోడ్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం 21 రోజులుగా ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ప్రక్రియకు మంగళవారంతో తెరపడనుంది. మే13న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈనెల 4వ తేదీ కౌంటింగ్ ప్రక్రయకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి పోస్టల్ ఓట్లు, 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 2 గంటలపైన ఎప్పుడైన ఫలితాలు వెలువడుతాయని అధికారులు స్పష్టం చేశారు. మొత్తంగా మధ్యాహ్నం 4 గంటలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ముగించనున్నారు. డ్యూటీలోని ఉద్యోగులు మంగళవారం ఉదయం 7గంటలకు హాజరుకావాలని ఇప్పటికే స్పష్టం చేశారు. మరోవైపు ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేశారు. ఆమేరకు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో వంద శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

ఐదంచెలతో పటిష్టమైన భద్రత

కౌంటింగ్ కేంద్ర వద్ద ఐదంచెల భద్రతతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు, వివాదాలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాన్ని ఎన్నికల అధికారి నిర్విరామంగా పరిశీలిస్తూ లోటుపాట్లును ఎప్పటికప్పుడు సవరిస్తూ ప్రత్యేక నిఘా పెంచారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు కొనసాగడంతోపాటు, 144 సెక్షన్ అమలుపై అవగాహన కల్పించారు. డ్రోన్లు ఎగుర వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సభలు, సమావేశాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలను పాల్పడితే కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. మొత్తంగా కౌంటింగ్ కేంద్రమైన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ భవనాలను పోలీసుల నిఘా నీడలో ఉంచారు.

అసెంబ్లీకి పోలైన ఓట్లు

	పురుషులు	స్త్రీలు
గూడూరు	95,535	97,880
సూళ్లూరుపేట	99,372	1,02,801
వెంకటగిరి	97,799	99,184
చంద్రగిరి	1,22,161	1,29,597
తిరుపతి	93,994	97559
శ్రీకాళహస్తి	1,00,982	1,05,930
సత్యవేడు	89,844	93,839
మొత్తం ఓట్లు	6,99,687	7,25,790

పార్లమెంట్‌కు పోలైన ఓట్లు

	పురుషులు	స్త్రీలు
సర్వేపల్లి	95,961	98,644
గూడూరు	95,535	97,880
సూళ్లూరుపేట	99,372	1,01,801
వెంకటగిరి	97,799	99,184
తిరుపతి	93,994	97,559
శ్రీకాళహస్తి	1,00,982	1,05,930
సత్యవేడు	89,844	93,839
మొత్తం ఓట్లు	6,73,487	6,94,837

జిల్లా సమాచారం...

ఓటర్లు	- 18,12,980
పురుషుల ఓట్లు	- 8,83,330
మహిళల ఓట్లు	- 9,29,466
ట్రాన్స్‌జెండర్లు	- 184
అసెంబ్లీకి పోలైన పురుషుల ఓట్లు	- 6,99,687
అసెంబ్లీకి పోలైనా స్త్రీల ఓట్లు	- 7,25,790
అసెంబ్లీకి పోలైన ట్రాన్స్ జెండర్ల ఓట్లు	- 63
అసెంబ్లీకి పోలైన మొత్తం ఓట్లు	- 14,25,540
అసెంబ్లీకి పోలైనా ఓట్ల శాతం	- 78.63
పార్లమెంట్‌కు మొత్తం ఓట్లు	- 17,29,832
పార్లమెంట్‌కు పురుషుల ఓట్లు	- 8,43,132
పార్లమెంట్‌కు స్త్రీల ఓట్లు	- 8,86,552
ట్రాన్స్‌జెండర్లు	- 148
పార్లమెంట్‌కు పోలైనా పురుషుల ఓట్లు	- 6,73,487
పార్లమెంట్‌కు పోలైనా స్త్రీల ఓట్లు	- 6,94,837
పార్లమెంట్‌కు పోలైనా మొత్తం ఓట్లు	- 13,68,362
పార్లమెంట్‌కు పోలైనా ట్రాన్స్ జెండర్ల ఓట్లు	- 38
పార్లమెంట్‌కు పోలైన ఓట్ల శాతం	79.10

అసెంబ్లీ-పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

గూడూరు	- 2639
సూళ్లూరుపేట	- 1978
వెంకటగిరి	- 2419
తిరుపతి	- 4414
శ్రీకాళహస్తి	- 2691
సత్యవేడు	- 1520
చంద్రగిరి	- 4492
7 అసెంబ్లీలకు	- 20,153 ఓట్లు

అసెంబ్లీలకు-హోమ్ ఓటింగ్ 85ఏళ్ల-దివ్యాంగులు

గూడూరు	71	23
సూళ్లూరుపేట	67	108
వెంకటగిరి	196	160
తిరుపతి	63	21
శ్రీకాళహస్తి	66	87
సత్యవేడు	37	24
చంద్రగిరి	83	62
7 అసెంబ్లీలకు	583	485

పవిత్రం..హనుమ జన్మస్థలం


వేద పఠనంలో పండితులు, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తదితరులు

తిరుమల: హనుమంతుడు జన్మస్థలం అంజనాద్రి పవిత్ర పుణ్యస్థలమని రాయల్ చెరువు శక్తి పీఠం రమ్యానంద భారతి తెలిపారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జాపాలి తీర్థంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రమ్యానంద భారతి అనుగ్రహ భాషణం చేస్తూ, అంజనాదేవికి వాయుదేవుని వల్ల తాను జన్మించినట్లు హనుమంతుడు సీతాదేవికి తెలిపారన్నారు. మాతంగ మహర్షి చెప్పిన విధంగా అంజనాదేవి వేంకటాచలానికి విచ్చేయడం, అక్కడ తపస్సు చేయడం, అంజనేయస్వామికి జన్మనివ్వడం, తదనుగుణంగా ఆ కొండకు ।అంజనాద్రి॥ అని పేరు వచ్చిందని వెల్లడించారు. బాలాంజనేయస్వామి సూర్యదేవుని పట్టుకోవడానికి వేంకటాద్రి నుంచి లంఘించడం, శ్రీరాముని దర్శనానంతరం సీతాన్వేషణలో భాగంగా తిరిగి వేంకటగిరికి రావడం, ఇక్కడ అంజనాదేవిని మళ్లీ చూడడం, వానర వీరులు వైకుంఠ గుహలో ప్రవేశించడం.. ఇలా అనేక విషయాలు వేంకటాచల మహత్యం ద్వారా తెలుస్తున్నాయని వివరించారు. అనంతరం స్వామీజీని ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేక అధికారి విభీషణ శర్మ ఘనంగా సత్కరించారు.

ఆకాశగంగలో..

ఆకాశగంగలోని బాలాంజనేయస్వామివారి ఆలయం వద్ద శనివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకుడు ఆచార్య రాఘవాచార్యులవారు హనుమంతుని జన్మ విశేషాలు వివరించారు.


రమ్యానంద భారతి స్వామిని సత్కరిస్తున్న విభీషణశర్మ తదితరులు

జాపాలి క్షేత్రంలో..

జాపాలి క్షేత్రంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీమతి రేవతి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రవి సుబ్రమణ్యం గాత్ర సంగీతం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు తిరుపతికి చెందిన ప్రసన్న లక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సరస్వతీ ప్రసాద్ హరికథ గానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి: ఆగి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి కోదండరామాపురం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీకి చెందిన అమ్ములు(35) అగ్రికల్చర్ కళాశాలలోని మెస్‌లో పనిచేస్తోంది. పెరుమాళ్లపల్లి పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన విశ్వనాథ్(25) ఆమెతోపాటు కలసి అక్కడే పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ వ్యక్తిగత పనులు నిమిత్తం ఆదివారం హోండా యాక్టివా వాహనంలో చిత్తూరుకు వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి తిరుపతికి పయనమయ్యారు. మార్గం మధ్యలో కోదండరామాపురం వద్ద వస్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో విశ్వనాథ్‌తో పాటు అమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సీఐ రామయ్య మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై స్థానికులతో విచారించారు. అనంతరం మృతదేహాలను తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

